27

# వృత్తి ధర్మం

పురాతన కాలంలో రైళ్ళూ, బస్సూలూ వంటివి లేవు.

ఒక చోటునుంచి మరోచోటికి ప్రయాణం చేయాలంటే... కాలి నడకన కాని, బండి మీద కాని వెళ్లవలసి వచ్చేది.

ఒకనాడు ఒక ఛాందసుడు తీర్థయాత్రలకు వెళ్తూ... మధ్యాహ్నం అయ్యేసరికి, మార్గమధ్యంలో ఒక మర్రిచెట్టు క్రింద విశ్రాంతి తీసుకోసాగాడు. ఆ చెట్టు క్రిందనే కూర్చొని దైవధ్యానం చేసుకుంటున్న ఒక సాధువుకి నమస్కరించి ఆయన ఆశీర్వచనం పొందాడు. ఆ తర్వాత కృష్ణ విగ్రహాన్ని బయటకు తీసి పూజ చేసి, నైవేద్యం పెట్టి భోజనం చేయడం మొదలు పెట్టాడు.

అదే సమయానికి పొరుగూరు నుంచి పెంట బండిని తోలుకుంటూ ఒక పాకీవాడు వచ్చి ఆ మర్రిచెట్టు క్రిందే మరో కొమ్మ క్రింద బండిని ఆపాడు. దగ్గరలో వున్న చెరువులో చేతులు కడుక్కొని వచ్చి ఆ పెంట బండి దగ్గరే కూర్చుని అన్నం తినసాగాడు.

పెంటబండి ప్రక్కనే కూర్చొని అన్నం తింటూండడం చూసి ఛాందసుడికి అసహ్యం వేసింది.

"నువ్వేమి మనిషివి.., ప్రక్కనే ఊరి వారందరి పెంటవున్న బండిని పెట్టుకొని అన్నం తింటున్నావు?" అని ఎద్దేవా చేశాడు.

ఆ పాకీవాడు వెంటనే "అయ్యా... నేను పెంటబండి ప్రక్కనే కూర్చుని అన్నం తింటున్నాను ... నిజమే! మరి, నీవు కడుపులోనే పెంట ఉంచుకొని అన్నం తింటున్నావే... నీ పొట్ట మాత్రం పెంటడబ్బా కాదా?" అన్నాడు.

ఆ సమాధానానికి నివ్వెర పోయాడు ఛాందసుడు.



"అమాయకంగా చెప్పినా... సత్యమే చెప్పాడు. పెంట ఎత్తడం అతని వృత్తి. ఏ వృత్తినీ కించ పరచకూడదు. నిజానికి ..,అందరి పెంటనీ ఎత్తి ఊరిని శుభ్రంగా ఉంచుతున్న పాకీ వారిని హీనంగా చూడకూడదు" అన్నాడు– అదంతా గమనిస్తున్న సాధువు.

సిగ్గుతో తల వంచుకున్నాడు ఛాందసుడు.

. . .